సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 18 । జూలై । 2023



ప్రకృతి సాగుపై అవగాహన

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని రైతు సాధికార సంస్థ రీజనల్ టెక్నికల్ లీడ్ ప్రకాశరావు అన్నారు. IIలో



సురక్షతో సమస్యలకు చెక్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. IIలో



విరబూసిన బ్రహ్మకమలాలు

సాక్షి,పాడేరు: లగిశపల్లిలో లకే అబ్బాయి దొర నివాసంలో 15 బ్రహ్మకమలాల విరబూశాయి. చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపారు

న్యూస్‌రీల్

ఐటీడీఏ స్పందనకు 40 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌లు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ 40 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. వై.రామవరం మండలం బంగారు బందలు గ్రామంలో జీపీఎస్ స్కూల్లో 30 మంది విద్యార్థులు ఉన్నారని, రెగ్యులర్ టీచర్‌ను నియమించాలని చింతలపూడి ఉపసర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి, పల్లాల మల్లు రెడ్డిలు స్పందనలో కోరారు. దేవీపట్నం మండలం మడిపల్లిలో ముర్ల లలిత ప్రియకు సంబంధించిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. అడ్డతీగల మండలం శెట్టిపల్లి గ్రామంలో భూ సమస్య పరిష్కరించాలని ఈక బాపన దొర దరఖాస్తు అందజేశారు.

వంతెన కిందికి జారిపడిన వ్యాన్



ప్రమాదానికి గురైన వ్యాన్

అరకులోయ టౌన్: చొంపి గ్రామానికి వెళ్లే రహదారిలో లోలెవెల్ వంతెన వద్ద బొలెరో పికప్ వ్యాన్ సోమవారం ప్రమాదానికి గురైంది. అరకులోయ నుంచి చొంపి పంచాయతీ పప్పుడువలసకు సిమెంట్ లోడుతో వెళుతున్న వ్యాన్ అదుపు తప్పి వంతెన పక్కకు జారి కిందపడింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వరద నీరు తగ్గుముఖం



గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరికి చేరిన వరద నీరు క్రమేపి తగ్గుముఖం పడుతోంది. గండిపోశమ్మ ఆలయం వద్ద సుమారు నాలుగు అడుగుల మేర నీరు తగ్గింది. సోమవారం ఉదయం నాటికి ఆలయ ప్రాంగణంలో నీరు పూర్తిగా తగ్గింది. గండిపోశమ్మ ఆలయం వద్ద గోదావరి ప్రమాదభరితంగా ఉండడంతో భక్తులెవరినీ అమ్మవారి దర్శనానికి అనుమతించడంలేదని ఆలయ అధికారులు తెలిపారు.

నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తులు

సాక్షి,పాడేరు: నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు చింతూరు డివిజన్ ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరంలో 6వతరగతిలో ప్రవేశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఎటపాక నవోదయ పాఠశాలలో ప్రవేశానికి రంపచోడవరం,చింతూరు డివిజన్ల పరిధిలోని 11మండలాలకు చెందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. వచ్చేనెల10వతేదీ లోగా www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 20న రాత పరీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు.

ఏడీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ



ఐటీడీఏ పీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏడీఎంహెచ్‌వో భాస్కర్

రంపచోడవరం: ఏడీఎం హెచ్‌వోగా డాక్టర్ జి.భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా, మలేరియా,డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను మర్యాదపూర్వకంగా కలిశారు.

అన్నదాతల వర్షాతిరేకం





పాడేరు-పెదబయలు రోడ్డులో గన్నేరుపుట్టు వద్ద దుక్కుపనిలో నిమగ్నమైన గిరిజన రైతు (ఇన్‌సెట్) పెదబయలు రోడ్డులో గంపరాయి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

- జిల్లాలోని వలు ప్రాంతాల్లో భారీ వర్షాలు
- వ్యవసాయానికి అనుకూలం
- జోరందుకున్న ఖరీఫ్ వనులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి పాడేరుతో పాటు సమీప గ్రామాల్లో ముసురు వాతావరణం నెలకొంది.ఖరీఫ్ వ్యవసాయానికి మేలు చేసేలా వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాడేరు డివిజన్‌లో ముందస్తు వర్షాలతో రెండు నెలల నుంచే నారుమడులను సిద్ధం చేసిన గిరిజన రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. పొలాల్లోకి నీరు చేరడంతో దుక్కి, దమ్ము పనులను హుషారుగా చేస్తున్నారు.లోతట్టు భూముల్లో వరినాట్లు జోరందకున్నాయి.పాడేరు డివిజన్‌లో 42వేల హెక్టార్ల విస్తీర్ణానికి గాను ఇప్పటికి 11వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు 'సాక్షి'కి తెలిపారు. రంపచోడవరం,చింతూరు డివిజన్ల పరిధిలోని 17వేల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతీ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగుచేస్తారు. అక్కడ కూడా వర్షాలు కురుస్తుండడంతో నారుమడుల తయారీ,దుక్కి, దమ్ము పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు.రాజవొమ్మంగి,అడ్డతీగల, వై.రామవరం మండలాల్లో ముందస్తుగా వేసిన నారుమడులు ఆశాజనకంగా ఎదగడంతో పాటు ప్రస్తుత వర్షాలు అనుకూలించడంతో వరినాట్లు వేస్తున్నారు.

ఉధృతంగా కొండవాగులు,గెడ్డలు

జోరుగా వర్షాలు కురుస్తుండడంతో కొండవాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.జి.మాడుగుల,పాడేరు,హుకుంపేట,పెదబయలు,ముంచంగిపుట్టు మండలాల వరకు విస్తరించిన మత్స్యగెడ్డలో వరద నీటి ఉధృతి ఎక్కువగా ఉంది.జోలాపుట్టు రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో అధికమైంది. చాపరాయిగెడ్డ,గోస్తనీ,చింతపల్లిలోని పెద్దగెడ్డ,కుడుముసారి గెడ్డలో కూడా నీటి ప్రవాహం అధికంగా ఉంది. రంపచోడవరం,చింతూరు డివిజన్ల పరిధిలోని గెడ్డల్లో నీటి ప్రవాహం క్రమేపి పెరుగుతోంది.చెరువులు,ఇతర మినీ రిజర్వాయర్‌లు నీటితో కళకళాడుతున్నాయి.



పాడేరు మండలం గుర్రగరువు లోతట్టు భూముల్లో పూర్తయిన వరినాట్లు

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం 183.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.ముంచంగిపుట్టులో 32.2, పెదబయలు 29.8, జి.మాడుగుల 17.4, పాడేరు 16.6, మారేడుమిల్లి 14.9, అరకులోయ 11.9, వై.రామవరం 11.4, హుకుంపేట 10.7, చింతూరు 8.5, అనంతగిరి 5.3, చింతపల్లి 5.3, జీకే వీధి 2.1, కొయ్యూరు 1.8, అడ్డతీగల 1.8, రంపచోడవరం 1.1, రాజవొమ్మంగి 1, దేవీపట్నం. 0.6,ఎటపాక 0.4,గంగవరంలో 0.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

5,882 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

- కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 10 మండలాల పరిధిలోని 15 సచివాలయాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు విజయవంతమైనట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. 12,007 గృహాల నుంచి వలంటీర్లు వివిధ ధ్రువీకరణ పత్రాల నిమిత్తం దరఖాస్తులను యాప్‌లో నమోదు చేశారని, 14,120 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగా, 5,882 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశామన్నారు. 8 దరఖాస్తులు తిరస్కరించామని, మిగిలిన 8,230 ధ్రువీకరణపత్రాలను రెండు మూడు రోజుల్లో సంబంధిత సచివాలయాల సిబ్బంది పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

నేడు జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు

జిల్లాలోని 13 మండలాల పరిధిలో 23 గ్రామసచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.అడ్డతీగల మండలంలో ఎల్లవరం,అనంతగిరి మండలంలో లుంగపర్తి,ఎస్.ఆర్.పురం, అరకులోయ మండలంలో బొండం,మాదెల, చింతూరు మండలంలో గూడురు,మోతుగూడెం ,డుంబ్రిగుడ మండలంలో గేదేలబంద,కొర్రా,జి.మాడుగుల మండలంలో జి.మాడుగుల-2, కె.కోడాపల్లి,కూనవరం మండలంలో జగ్గవరం,ముంచంగిపుట్టు మండలంలో జర్జుల,వనుగుమ్మ, ఎటపాక మండలంలో గొమ్ము కొత్తగూడెం,గౌరీదేవిపేట, పాడేరు మండలంలో తుంపాడ, పాడేరు-2, పెదబయలు మండలంలో లింగేటి, రూడకోట,రంపచోడవరం మండలంలో ఆకూరు,పెదగడ్డాడ, వై.రామవరం మండలంలోని చింతలపూడి సచివాలయాల్లో జరిగే జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ రూరల్: ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అరకులోయ,అనంతగిరి,డుంబ్రిగుడ, హుకుంపేట,పెదబయలు మండలాల వెలుగు ఏపీఎం, సీసీలు, డ్వాక్రా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు రుణాలు అందజేస్తున్నట్టు చెప్పారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 550 మందికి స్వయం ఉపాధి పథకాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించినట్టు చెప్పారు. ఇప్పటి వరకు స్వయం ఉపాధి పథకాల కోసం 130 మందికి రుణాలు అందజేశామని, బ్యాంకుల నుంచి పొందిన రుణాలు సకాలంలో చెల్లిస్తే మళ్లీ రుణాలు పొందవచ్చని తెలిపారు. రైతు ఉత్పత్తులను సేకరించి వీడీవీకేల ద్వారా మార్కెట్ సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. పాడేరులో అద్దాకుల తయారీ, అరకులోయలో కాఫీపొడి యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహక, అభివృద్ధి సంస్థ పీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం రవితేజ, డీఆర్‌డీఏ పీడీ మురళీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో అనంతగిరి వెళ్లి, అక్కడ ఏర్పాటు చేసిన కాఫీ యూనిట్లను పరిశీలించారు.



మాట్లాడుతున్న పీవో అభిషేక్

టీబీ రహితంగా జిల్లా

- వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ విఘ్నేష్

పాడేరు రూరల్: టీబీ రహితంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ విఘ్నేష్ అన్నారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ ఏడాది నమోదైన కేసుల వివరాలు, తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐటీడీఏలో టీబీ యూనిట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, పాఠశాలల్లో తరచూ టీబీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. టీబీ రోగులను గుర్తించి, సకాలంలో చికిత్స, మందులు అందజేసే బాధ్యత టీబీ సిబ్బంది, ఆశా కార్యకర్తలపై ఉందన్నారు. ఏజెన్సీని టీబీ రహితంగా తీర్చిదించేందుకు అందరూ సంయుక్తంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సొమ్ముతో సరైన పౌష్టికాహారం తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ టి.విశ్వేశ్వరనాయుడు, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, స్థానిక టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ విఘ్నేష్

వర్షాలకు కూలిన ఇళ్ల పైకప్పులు



భారీ వర్షానికి పై కప్పు కూలిన ఇంటి వద్ద బాధితులు

ముంచంగిపుట్టు :మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో ఇళ్లపై కప్పులు కూలిపోయాయి. మండల కేంద్రంలోని ఇందిరా కాలనీలో పాత్రో రామ్మూర్తి ఓ ఇంటి పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట కూలిన గోడ

కూలిన ప్రహరీ

సాక్షి,పాడేరు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నానిపోయిన పట్టణంలోని ఐటీడీఏ నివాసాలకు చెందిన ప్రహరీలో కొంతభాగం సోమవారం ఉదయం వీచిన ఈదురుగాలుల తీవ్రతకు కూలిపోయింది. పాడేరు మెయిన్‌రోడ్డులోని శ్రీనివాస లాడ్జీ ఎదురుగా ఐటీడీఏ నివాసాలు ఉన్నాయి. వాటిలో ఒక నివాసంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని నిర్వహిస్తుండగా, మరో నివాసంలో సమాచారశాఖ సిబ్బంది ఉంటున్నారు. ప్రవేశద్వారం వద్ద గోడ కూలిపోయింది.

చేరువలో ఉన్నత విద్య..!



విశాఖ నగరంలోని సీతమ్మధారలో బాలికల కోసం నిర్వహిస్తున్న ప్లస్-2 స్కూల్



ప్లస్-2 స్కూల్లో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం విద్యార్థినులు

- ప్రతి మండలంలో రెండు జూనియర్ కాలేజీలు
- ఇందులో ఒకటి బాలికలకు ప్రత్యేకం
- ఆ దిశగానే గత ఏడాది ఉమ్మడి విశాఖలో 10 ప్లస్ టూ స్కూల్స్ ఏర్పాటు
- తాజాగా కో - ఎడ్యుకేషన్ కాలేజీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- విశాఖకు 1, అనకాపల్లికి 3, అల్లూరి జిల్లాకు 2 మంజూరు

విశాఖ విద్య: పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఒకటి బాలికల కోసం కేటాయించనున్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలనే తలంపుతో గతేడాది ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇంటర్మీడియట్ కోర్సుల నిర్వహణకు 10 ప్లస్ టూ స్కూల్స్ (విశాఖపట్నంలో 6, అనకాపల్లి జిల్లాలో 4)ను ప్రారంభించారు. తాజాగా అవసరమైన మండలాల్లో కో - ఎడ్యుకేషన్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఉమ్మడి విశాఖలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏటా 50 వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరుతారు. విశాఖపట్నం జిల్లాలో 185 జూనియర్ కాలేజీలు ఉండగా, ఇందులో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 25 అందుబాటులో ఉన్నాయి. అనకాపల్లిలో 136 కాలేజీల్లో 60, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 39లో 27 ప్రభుత్వ యాజమన్యాల పరిధిలో నిర్వహిస్తున్నారు.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

కొత్తగా జూనియర్ కాలేజీ మంజూరు కోసం గతంలో ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. అందుబాటులో కాలేజీలు లేక, గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది విద్యార్థినులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితులు ఉండేవి. దీన్ని గుర్తించిన దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకేసారి ఏకంగా 34 కస్తూర్బా గాంధీ విద్యాలయాలను మంజూరు చేశారు. ఆ తర్వాత వచ్చిన పాలకులెవ్వరూ కొత్త కాలేజీల మంజూరుకు శ్రద్ధ తీసుకోలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త కాలేజీల ఊసే లేకపోగా, ఉత్తరాంధ్ర జిల్లాకు కూడలిగా ఉన్న విశాఖపట్నం కేంద్రంగా కొంతమంది కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జూనియర్ కాలేజీలను నిర్వీర్యం చేశారు.

ప్రతి మండలంలో రెండు కాలేజీలు

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కాలేజీలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఒకటి బాలికల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తూనే, మరొకటి కో - ఎడ్యుకేషన్ కాలేజీగా ఉండేలా ప్రాధాన్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అవసరమైన మండలాల్లో అదనపు కాలేజీల ఏర్పాటుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్తగా 6 కో ఎడ్యుకేషన్ కాలేజీలు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కొత్తగా ఆరు కో - ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలు మంజూరయ్యాయి. విశాఖపట్నం జిల్లా పద్మనాభం, అనకాపల్లి జిల్లాలో అచ్యుతాపురం, నాతవరం, ఎస్.రాయవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొయ్యూరు, పెదబయలు మండలాల్లో కో - ఎడ్యుకేషన్ జూనియర్ కాలేజీలు మంజూరు చేశారు. ప్లస్ - 2 స్కూల్స్‌గా గుర్తించే వీటిని పాఠశాలల్లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా మండలాల్లో పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు సౌలభ్యంగా ఉండే పాఠశాలలను గుర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు



ప్రతీ మండలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు జూనియర్ కాలేజీలు ఉండాలనేది ప్రస్తుత ప్రభుత్వం ఉద్దేశం. ఇది చాలా మంచి నిర్ణయం. డ్రాపవుట్ల నివారణకు దోహదపడుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువుల వైపు వస్తారు.

– ఎల్.చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

కాయగూరలే కంఠాభరణాలై...



ప్రత్యేక అలంకరణలో..

- దేవతామూర్తులకు ఆకుకూరలతో అలంకరణ
- శివనామస్మరణతో హోరెత్తిన నీలకంఠేశ్వరస్వామి ఆలయం

సాక్షి,పాడేరు: స్థానిక పాతబస్టాండ్‌లోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన శివలింగంతో పాటు, విగ్రహాలను సోమవారం కాయగూరలతో అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆలయ ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు,భక్తులు ఆలయంలోని శివలింగానికి కూరగాయలు,ఆకుకూరలతో అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు రామం ప్రత్యేక పూజలు జరిపారు.ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నరసింగరావు, పలువురు భక్తులు బ్రహ్మకమలాలతో పూజలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయం హోరెత్తింది. ఈ సందర్భంగా ఆలయంలోని శివుని నిలువెత్తు విగ్రహం, ఆలయ ప్రాంగణంలో శివపార్వతులు, త్రిమూర్తులు, సుబ్రహ్మణ్యస్వామి,కాలభైరవస్వామి,దక్షిణామూర్తి, వీరభద్రస్వామి,చండీశ్వరుడు,గంగమ్మతల్లి విగ్రహాలకు కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ ప్రసాదాలను పంపిణీ చేసింది. రాత్రి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



కూరగాయలు,ఆకుకూరల అలంకరణలో ఆది దంపతులు



కాలభైరవస్వామి విగ్రహం




త్రిమూర్తుల విగ్రహాలు



శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఏడుగురు సీఐలకు స్థానచలనం



దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ రేంజ్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగిస్తూ డీఐజీ హరికృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్‌లు ఇవ్వగా.. ఇద్దరిని వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న కె.కె.వి.విజయనాథ్‌ను విజయనగరం డీఎస్‌బీలో పోస్టింగ్ ఇవ్వగా, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జి.రాంబాబును వీఆర్‌కు పంపించారు. అలాగే వీఆర్‌లో ఉన్న కె.లక్ష్మణమూర్తిని శ్రీకాకుళం డీసీబీకి, డి.నవీన్‌కుమార్‌ను శ్రీకాకుళం డీసీఆర్‌బీలో పోస్టింగ్ కల్పించారు. అలాగే శ్రీకాకుళం డీసీఆర్‌బీలో ఉన్న బి.ప్రసాదరావును నరసన్నపేట సర్కిల్‌కు, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న డి.రామును విశాఖ రేంజ్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న వి.బాబ్జీరావును శ్రీకాకుళం సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

క్లుప్తంగా

ఉషు పోటీల్లో పతకాల పంట



క్రీడాకారులను అభినందిస్తున్న ఆర్డీవో హెచ్.వి.జయరాం

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి ఉషు పోటీల్లో నర్సీపట్నానికి చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్ర స్థాయి వూషు చాంపియన్‌షిప్ జరిగింది. నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పాల్గొని, ఏడు బంగారు, 3 రజత, ఒక కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఆర్డీవో హెచ్.వి.జయరాం అభినందించారు. ఈ పోటీల్లో కె.జాహ్నవి, జి.జ్యోతి, కె.శరణ్య, పి.లేఖ్య, నవదీప్, లోకేష్, బబ్బులు, రాజమౌళి, హేమసాయి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు, కోచ్‌లను ఆర్డీవో ప్రశంసించారు.

చౌడేశ్వరి శూలాల ఉత్సవం



చౌడేశ్వరి శూలాల ఉత్సవ ఊరేగింపు

కశింకోట: స్థానిక కస్పావీధిలో సోమవారం రాత్రి చౌడేశ్వరి అమ్మవారి శూలాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి ఆలయం నుంచి భక్తులు గంప శూలం, సాంబ శివుని శూలం, బుగ్గ శూలాలు వగైరా ధరించి ప్రభలు, డప్పులు, వాయిద్యాలు, మహిళల కోలాటాలతో బాణసంచా వెలుగుల్లో ఊరేగింపు సాగింది. అక్కడి నుంచి పెద బజారు, డీపీఎన్ హైస్కూల్, పాల కేంద్రం, ఉప్పునీటి దిబ్బ, ద్వారపురెడ్డి వారి వీధి మీదుగా ఊరేగింపు నిర్వహించి, తిరిగి ఆలయానికి చేరుకుంది. ప్రజలు దారి పొడవునా పూజలు చేశారు. ఉత్సవాన్ని భక్తి పారవశ్యంతో తిలకించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగం (ఎస్టీఎం) ఈనెల 15న రికార్డు ఉత్పత్తి సాధించింది. ఈ విభాగంలో తయారయ్యే 50/50/6 ఏంగిల్‌ను ఆ రోజు అత్యధికంగా 2,267 టన్నులు ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది మే 8న అత్యధికంగా 2173 టన్నులు ఉత్పత్తి చేయగా ఇప్పుడు ఆ రికార్డును అధిగమించారు. రికార్డు ఉత్పత్తి సాధించిన ఎస్టీఎం విభాగం ఉద్యోగులను స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి కోయిలాడ శ్రీనివాసరావు అభినందించారు.

ప్రకృతి సాగుపై అవగాహన



పోక్కుపేటలో రైతులకు బీజామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



జియ్యంపాలెంలో రైతులకు కషాయం తయారీ విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది, చిత్రంలో సర్పంచ్ సుబ్బలక్ష్మి

డుంబ్రిగుడ: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని రైతు సాధికార సంస్థ రీజనల్ టెక్నికల్ లీడ్ ప్రకాశరావు అన్నారు. మండలంలోని సాగర పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి సాగులో ఉన్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర పంటల సాగుపై దృష్టి సారించాలని, దీంతో ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. దీనిపై గ్రామాల్లో రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. సంస్థ ప్రతినిధులు హేమసుందర్, రిసోర్స్ పర్సన్ దేముళ్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో లాభాలు

రంపచోడవరం: సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయంతో రైతులు లాభాలు పొందవచ్చని వైస్ ఎంపీపీ పండా కుమారి అన్నారు. మండలంలోని పోక్కుపేట రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సేంద్రియ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతింటోందన్నారు. సంప్రదాయ పంటలైన రాగులు, చోళ్లు వంటి పంటలను గిరిజన రైతులు పండించాలన్నారు. ప్రభుత్వం చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. సచివాలయం వద్ద రైతులకు బీజామృతం తయారీ పద్ధతులను వ్యవసాయ అధికారులు వివరించారు. సర్పంచ్ పి.లక్ష్మి, పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం సాగు పై గిరిజన రైతులు దృష్టి పెట్టాలి

గంగవరం : ప్రకృతి వ్యవసాయ సాగుపై గిరిజన రైతులు దృష్టి పెట్టాలని జియ్యంపాలెం సర్పంచ్ కంగల సుబ్బలక్ష్మి అన్నారు. సోమవారం జియ్యంపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతు కారం అనసూయ దశ పర్ణి, కషాయం తయారీపై రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. కషాయంతో అన్ని రకాల పురుగులు తెగుళ్ల నివారించడానికి వినియోగించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సీఆర్పీలు వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, అంతర్లయ్య, శ్రీను, శిరీష ప్రకృతి, సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు.

జగనన్న సురక్షతో సమస్యలకు చెక్



కంఠారంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చిత్రంలో ఎంపీపీ రమేష్ తదితరులు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

కొయ్యూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సర్వత్రా విజయవంతమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కంఠారంలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని, చెక్ పెడుతున్నారన్నారు.అర్హులందరికీ అన్ని సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందించాలనే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో సర్టిఫికెట్ల కోసం అధికారుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని ప్రస్తుతం మన ప్రభుత్వ పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయని, గంటల్లో ధ్రువీకరణ పత్రాలు మంజూరవడం హర్షణీయమన్నారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేశారన్నారు. అత్యుత్తమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలు, సర్పంచ్ కన్నయమ్మ మండల పార్టీ అధ్యక్షుడు బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, ఏఎంసీ చైర్ పర్సన్ కె.రాజులమ్మ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, ఎంపీడీవో లాలం సీతయ్య, ఉప సర్పంచ్ వనంబాబు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొట్టి ఒకరు మృతి... ఇద్దరికి తీవ్ర గాయాలు



పెద్ద గెద్దాడ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రామిరెడ్డి

రంప చోడవరం : రంపచోడవరం సమీపంలోని పెద్ద గెద్దాడ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పెద్ద గెద్దాడ శివారులో రెండు ద్విచక్ర వాహనాలను లారీ ఢీకొనడంతో పెదపాడు గ్రామానికి చెందిన ఎర్రగొండ రాజబాబు, కత్తుల రవితేజ రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదానికి కారణమైన లారీని రంపచోడవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో కోండ్ల అచ్యుతరామిరెడ్డి (25) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు దేవీపట్నం మండలం మంటూరు గ్రామానికి చెందిన వాడు. మారేడుమిల్లి మండలం రామన్నవలస గ్రామానికి చెందిన చదల బేబీ కుమారిని నాలుగు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. సోమవారం భార్య ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

అక్రమ మద్యం స్వాధీనం: ఆరుగురి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ తాతారావు, ఎస్ఐ దామోదర్‌నాయుడు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మాడుగుల రూరల్ : గాదిరాయిలో ఒక కల్లంపాకలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ మద్యంను స్థానిక ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు సోమవారం పట్టుకున్నారు. ఈ కేసులో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు కె.కోటపాడు రూరల్ సీఐ కె.తాతారావు, స్థానిక ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు సోమవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. గాదిరాయి గ్రామానికి చెందిన పడాల నాగేశ్వరావు కల్లం పాకల వద్ద ఒడిశా నుంచి తీసుకువచ్చిన 220 మద్యం బాక్స్‌లను అక్రమంగా నిల్వ చేశారు. ఒక్కో బాక్స్‌లో 48 సీసాలు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులు పడాల నాగేశ్వరావు, సుంకర సింహాచలంనాయుడు, శానాపతి సత్యం అప్పారావు, పడాల మహలక్ష్మినాయుడు, ఎస్.కొండన్న, మెల్లి శ్రీనులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు మద్యం విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని తెలిపారు.

వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కృషి



వరద సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అనసూయ

వీఆర్‌పురం: వరదలు సంభవిస్తే సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కృషి చేయాలని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో వరద పరిస్థితిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వరదల సమయంలో సిబ్బందికి ఎట్టి పరిస్థితుల్లో సెలవులు మంజూరు చేయవద్దని చెప్పారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వరదలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవరించాలన్నారు. రేఖపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధనలక్ష్మి మాట్లాడుతూ వరదల దృష్ట్యా తేలు,పాము కాటు మందులను అవసరం మేరకు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాయి మాట్లాడుతూ వరదల సమయంలో పునరావస కేంద్రాల్లోని నిర్వాసితులకు తాగునీటిని సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు చెప్పారు.సమావేశంలో ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఎంపీడీవో రత్న కుమారి, ఏవో రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పంచాయతీలో బఫర్ స్టాక్

కూనవరం: ప్రతీ పంచాయతీలో ముంపులేని చోట ఈనెల 21 నుంచి బఫర్‌స్టాక్ నిల్వచేస్తామని తహసీల్దార్ కె.అనసూయ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వరద సమీక్ష సమావేశంలో ఆమె మాట్లడుతూ ప్రజా ప్రతినిధులు, పెద్దలు, చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని, ఈవిషయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ పునరావాస కేంద్రాలలో వరద బాధితులకు కొవ్వొత్తులతో పాటు, కిరోసిన్ అందజేయాలన్నారు. పడవలను అందుబాటులో ఉంచాలని, టార్పాలిన్లు పంచాయతీల వారీగా బాధితులకు సరఫరా చేయాలని సూచించారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ప్రతీ పంచాయతీకి వీఆర్వో, కార్యదర్శి, సర్పంచ్ కమిటీగా ఉండి మానటరింగ్ చేస్తారని చెప్పారు.

ప్రతీ సమాచారం అందేవిధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని, అందిన సమాచారం మేరకు ఆయా ప్రాంతాలకు అవసరమైన టీమ్‌లను పంపుతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు హేమంత్, కారం పార్వతి, తెల్లం నిరోషా, కట్టం లక్ష్మి, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎఫ్ఆర్వో మోహిని విజయలక్ష్మి, ఎస్ఐ బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు 'ఆరోగ్య' సిరి

- ఆరోగ్యశ్రీలో వేల చికిత్సలు
- జూన్‌లో రూ.4 కోట్ల ఆదాయం



మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్ ఆర్థికంగా మెరుగుపడుతోంది. ఆరోగ్యశ్రీలో క్యాన్సర్, గుండె జబ్బులకు మెరుగైన వైద్యం అందిస్తుండడం వరంగా మారింది. క్యాన్సర్, గుండెజబ్బులు, డెంగ్యు, మలేరియా, చికున్ గున్యాతోపాటు సుమారు 2 వేలకు పైగా జబ్బులను ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం చేర్చింది. ఈ అవకాశాన్ని కేజీహెచ్ అందిపుచ్చుకుంది. ఇంతవరకు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే ఆరోగ్యశ్రీకి మెరుగైన వైద్యం అందేది. ఇప్పుడు కేజీహెచ్ కూడా ఆ జాబితాలో చేరింది. అధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వం అందించడంతో కీలకమైన ఆపరేషన్లు ఇక్కడే నిర్వహిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో జూన్ నెలలో వివిధ వైద్య సేవలు అందించినందుకు గానూ రూ.4 కోట్ల ఆదాయం లభించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక నెలలో ఇంత ఆదాయం సమకూరడం ఓ రికార్డు.

కేసులు వివరాలు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా జూన్‌లో 2,460 మందికి చికిత్సలు అందించారు. దీని ద్వారా రూ.4 కోట్ల ఆదాయం లభించింది. మేలో 2,300 కేసులకు రూ.40 లక్షలు, ఏప్రిల్‌లో 2,200 కేసుల ద్వారా రూ.38 లక్షలు, మార్చిలో 2,300 కేసుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరింది.

ఆరోగ్యశ్రీలో చికిత్సలు.. సమకూరిన ఆదాయం

మార్చిలో మొత్తం కేసులు	: 2,300
సమకూరిన ఆదాయం	: రూ.45 లక్షలు
ఏప్రిల్‌లో	: 2,200 కేసులు
ఆదాయం	: రూ.38 లక్షలు
మేలో	: 2,300 కేసులు
ఆదాయం	: రూ.40 లక్షలు
జూన్‌లో	: 2,460 కేసులు
ఆదాయం	: రూ. 4 కోట్లు



ఆరోగ్యశ్రీలో పేదలకు వైద్యం



పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఆశయాన్ని ముందుకు నడిపించేందుకు కృషి చేస్తున్నాం. ఇటీవల కాలంలో ఆరోగ్యశ్రీ పరిధిలో శస్త్ర చికిత్సలు ఎక్కువ చేశాం. దీని ద్వారా అధిక ఆదాయం సమకూరింది. పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది. మంగళవారం ఆస్పత్రిలో అన్ని వైద్య విభాగాధిపతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

– డాక్టర్ పి.శివానంద్, కేజీహెచ్ సూపరింటెండెంట్, విశాఖపట్నం

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

పాయకరావుపేట : పట్టణంలో నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన రైలు నుండి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడని తుని రైల్వే పోలీసు ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం ఉదయం గౌహతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్రమాదవశాత్తూ 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి జారిపడి మృతి చెందినట్టు తెలిపారు. మృతుని వద్ద లభించిన ప్రయాణపు టిక్కెట్టు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సెంచరీ దాటినా చలాకీగా..!

రోజూ రెండు మూడు గంటల నడక.. ఎనిమిది గంటల నిద్ర.. వ్యాయామం.. ఒంటిపూట భోజనం.. మితాహారం.. ఇదంతా దాదాపు యాభై ఏళ్ల నుంచి అలవాటు చేసుకున్నారాయన! ఇప్పుడాయనకు వందేళ్లు దాటాయి. అయినా.. ఇప్పటికీ నడక మానలేదు. వ్యాయామం ఆపలేదు. సంపూర్ణ ఆరోగ్యంతో రోజుకి 12 కిలోమీటర్లు నడుస్తున్నారు. మంగళవారం 101 ఏట అడుగు పెడుతున్న ఆయన పేరు వి.శ్రీరాములు. ఊరు మచిలీపట్నం. స్థిరపడింది విశాఖపట్నం.

- నిత్యం రోజూ 12 కి.మీ. నడక.. వెయిట్ లిఫ్టింగ్
- జీవితంలో ఒక్క రోజూ ఆస్పత్రి మెట్లెక్కని వైనం
- దేశంలో రిటైర్డ్ నేవీ ఉద్యోగుల్లో శతాధిక వృద్ధుడు
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వందల్లో పతకాలు
- నేడు 101వ వసంతంలోకి అడుగుపెట్టనున్న శ్రీరాములు

సాక్షి, విశాఖపట్నం: అరవై దాటితే ఏళ్లకే జీవితం అయిపోయిందనుకుంటూ నిట్టూరుస్తున్న రోజులివి. కానీ.. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన వి.శ్రీరాములు అలా అనుకోవడం లేదు. వయసు నూరేళ్లు దాటినా.. ఇంకా విదేశాల్లో జరిగే అథ్లెటిక్ పోటీలకు సన్నద్ధమవుతున్నారు. 1923 జూలై 18న దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఆయన తన 21వ ఏట (27 మార్చి 1944లో) అప్పటి రాయల్ ఇండియన్ నేవీలో చీఫ్ పెట్టీ ఆఫీసర్‌గా చేరారు. 1979 డిసెంబర్ 31న కమాండర్ హోదాలో పదవీ విరమణ చేసి విశాఖలో స్థిరపడ్డారు. ఆపై ఆరోగ్యాన్నిచ్చే నడకను అలవాటు చేసుకున్నారు. ఆ తర్వాత రేస్ వాకింగ్‌తో పాటు రన్నింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి ఆటల్లోనూ సత్తా చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో లెక్కకు మిక్కిలి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఏసియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 5, 10, 20 కి.మీ. రేస్ వాకింగ్ పోటీల్లో 9 బంగారు, 5 రజత, 2 కాంస్య పతకాలు, వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో 5 బంగారు, 3 రజత పతకాలను కైవసం చేసుకున్నారు. వెటరన్స్ (మాస్టర్స్) కేటగిరీలో ఇప్పటికీ ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొంటూ బంగారు, రజత, కాంస్య పతకాలను సాధిస్తూనే ఉన్నారు. అంతేనా? పర్వతారోహణం పైనా మక్కువ ఉన్న శ్రీరాములు 79వ ఏట తన కుమారుడు సాగర్‌తో కలిసి 2002లో ఆఫ్రికాలోని కిలీమాంజారో, 81వ ఏట 2004లో ఎవరెస్ట్ బేస్ క్యాంపు, 83వ ఏట హిమాలయాల్లోని పిండారీ గ్లేసియర్‌లను అధిరోహించారు.



సాధించిన పతకాలను చూపిస్తూ

ఇంకా అంతర్జాతీయ పోటీలకు సై..

శ్రీరాములు 101వ ఏట ఈ ఏడాది నవంబరు 8-12 వరకు ఫిలిప్పీన్స్‌లో జరిగే ఏసియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ కాంపిటిషన్స్‌లో, వచ్చే ఏడాది జూన్‌లో స్వీడన్‌లో నిర్వహించే వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు సిద్ధమవుతున్నారు. శ్రీరాములుది విభిన్న జీవనశైలి. మితంగా తింటారు. ఉదయం మొలకల చట్నీతో ఒక బ్రెడ్ టోస్ట్, కాఫీ లేదా మజ్జిగ తీసుకుంటారు. మధ్యాహ్నం పెరుగన్నమే తింటారు. అందులో కూరలు నంజుకుంటారు. సాయంత్రం కప్పు మజ్జిగ లేదా అరటిపండు తీసుకుంటారు. రాత్రికి ఏమీ తినకుండా 7.30కే నిద్రకు ఉపక్రమిస్తారు. మర్నాడు తెల్లవారుజామున 3.15కి బీచ్‌లో నడకకు బయలుదేరి (12 కి.మీ.) ఉదయం 6 గంటలకు తిరిగి ఇంటికి చేరుకుంటారు. వందేళ్ల ప్రాయంలో ఆయన పుస్తకాలు బాగా చదువుతారు. ఆస్ట్రానమీ, జియో పాలిటిక్స్, నేవీకి సంబంధించిన అంశాలపై ఆసక్తి కనబరుస్తారు. పిల్లలు స్థిరపడటంతో సతీమణితో కలిసి విశాఖలో ఉంటున్నారు.

నేడు శతాధిక సంబరాలు..

శ్రీరాములు 101 ఏటలోకి అడుగిడుతున్న సందర్భంగా విశాఖ బీచ్‌లో సాటి వాకర్ స్నేహితులు మంగళవారం ఉదయం ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించనున్నారు. మరో విశేషం ఏమంటే.. దేశంలో నేవీలో పనిచేసి వందేళ్లకు పైగా జీవించి ఉన్న ఏకైక అథ్లెట్ శ్రీరాములే కావడం విశేషం.



విశాఖ బీచ్‌రోడ్డులో వాకింగ్ చేస్తున్న శ్రీరాములు

హ్యాపీగా జీవించడమే లక్ష్యం..

నాకేమీ లక్ష్యాలు లేవు. ఉన్నదల్లా ఉన్నన్నాళ్లూ హ్యాపీగా జీవించడమే. నేను ఇప్పటివరకు ఆస్పత్రి మెట్లెక్కలేదు. రక్తపోటు, మధుమేహం సహా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. ఆఖరి ఘడియాల్లోనూ ఆస్పత్రికి వెళ్లకూడదన్నది నా ఆశ. క్రమశిక్షణతో కూడిన జీవితం ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. తక్కువ తిని, ఎక్కువ వ్యాయామం చేయాలని ఈ తరం వారికి నేనిచ్చే సలహా. నా ఆరోగ్య రహస్యం కూడా అదే. త్వరలో పాల్గొనే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని మెడల్స్ సాధిస్తానన్న నమ్మకం ఉంది.

– వి.శ్రీరాములు, శతాధిక అథ్లెట్